# సన్మానం

మహర్షి

ఉదయాన్నే తలుపు చప్పుడవుతుంటే తాయారమ్మ బద్ధకంగా ఒళ్ళు విరుచుకుని పెద్దగా ఆవులించి మెల్లగా వెళ్ళి తలుపు తీసింది.

ఎదురుగా పదిమంది కాలనీ వాళ్ళు నిలబడి వున్నారు. ఏమిటి అన్నట్లు చూసింది వారివైపు.

"అప్పయ్య ఉన్నారా?'' అడిగాడొకతను.

అంతే! తాయారు బావురుమంటు వెనక్కి తిరిగి "నేనే మన్యాయంచేశాన్రో దేవుడోయ్! మిమ్మల్ని తన్నడానికి పదిమంది వచ్చారండోయ్! ఎవర్ని ఏమన్నారో ఏమో! వాళ్ళు ఏం చేస్తారో ఏమో ఖర్మ. ఏ రకంగా తంతారో. అంత మంది ఒకేసారి తంతుంటే చూసి ఎలా భరించాలిరా భగవంతుడా! '' టాప్‌లేచి పోయేలా శోకాలు తీస్తూ భర్తను లేపి కాళ్ళకు నమస్కరిస్తూ "ఏ కాలు తీస్తారో ఏమిటో? కుడికాలు తీయమని చెప్పండి ఎడం కాలు ఊతంగా వుంటుంది.

"అందరూ కుంటోడి పెళ్ళాం అని అంటుంటే ఎలా భరించేది. ఈ అవమానం ఎలా తట్టుకునేదిరా దేవుడా!'' వెక్కి వెక్కి ఏడుస్తోంది తాయారమ్మ.

"ఛీ, ఛీ—నీ శోకాలు నాశనం కాను. ఆదివారం హాయిగా నిద్రపోదామనుకున్నాను. అది కాస్త హరీ మనిపించావు. కలలో నిన్నేమైనా అల్లరి దెయ్యాలు గొడవ చేశాయా? ఎందుకలా శోకాలు తీస్తావు? చుట్టుపక్కల వాళ్ళు చూస్తే పరువు పోతుంది '' రుసరుసలాడాడు అప్పయ్య.

"బయట మిమ్మల్ని తన్నటానికి పదిమంది వచ్చారు వెళ్ళండి. వాళ్ళు అలా తంతుంటే నేను చూడలేను. ఈ మూల కూర్చుని ఏడుస్తుంటాను మీరెళ్ళండి'' అన్నది తాయారు పైట చెంగుతో కళ్ళు అద్దుకుంటూ అప్పయ్య విసుక్కుంటూ బయటకొచ్చాడు.

"నమస్కారం అప్పయ్యగారూ!'' అన్నారు వాళ్ళు.

"ఎవరు మీరు?'' అర్థంకాక అడిగాడు అప్పయ్య.

"మేము ఈ కాలనీ సంఘం మెంబర్లం. మమ్మల్ని ఎప్పుడూచూసి వుండరులెండి. ఎందుకంటే అవసరం అయితే కానీ ఎవరకీ కనిపించం. మీకీ మధ్య లాటరీ తగిలింది కదా!'' అన్నాడొకతను.

"చందా కోసం వచ్చారా?''

"కాదు. మన కాలనీ తరపున మిమ్మల్ని సన్మానం చేయాలని వచ్చాం. మీ అనుమతి కోసం వచ్చాం మీరు మాతో సహకరించాలి. ఏదో ఒకటి చేయాలని మా చేతులు గులగులగా వున్నాయి'' అన్నాడొకతను.




తాయారు కళ్ళు తుడుచుకుని గబగబా బయటకు వచ్చింది ఆనందంగా.

"సన్మానం చేస్తారా బాగానే వుంది. సన్మానం చేయించుకోవటానికి నాకేం అర్హతలున్నాయి'' అన్నాడు ఇబ్బంది ఫీలవుతూ.

"మీరలా నాన్చితే లాభం లేదు. మీ గొప్పతనం ఏమిటో మేమే చెబుతాం''

"ఆయనలాగే నాన్చుతారు బాబూ! పెళ్ళి విషయంలో కూడా ఇలా నాన్చి వుంటే ఈ పాటికి ఏ డాక్టర్నో కట్టుకుని ఏ స్టేట్స్‌కో ఫ్లైట్‌లో జామ్మంటూ వెళ్ళివుండేదాన్ని. ఈయన్ని కట్టుకుని రుబ్బురోలువలె ఇంట్లో పడి వున్నాను...

"తాయారూ! మన విషయం వీళ్ళకెందుకు.'

"మీరుండండి. అవకాశం వచ్చింది కదాని చెబుతున్నాను. అవకాశం మళ్ళీ మళ్ళీ వస్తుందా? ఈయనకు సన్మానం జరిగితే ప్రక్కనుండి చూసి ఆనందించాలనే కోరికను నాలోనే దాచుకుని దాచుకుని ఈ మధ్యనే కడిగేసుకున్నాను. నా అదృష్టం పండి ఆ దేవుడు మిమ్మల్ని దూతగా పంపించాడు. ఈయన ఒప్పుకున్నట్లే''.

"అదికాదు తాయారు నేను చెప్పేది విను.''

"వినను కాక వినను. మీరు అంగీకరించకపోతే నేను బావిలో దూకి చస్తాను'' అల్టిమేటం యిచ్చింది తాయారు.

బావిలో దూకి చేస్తే మిగతావాళ్ళు వీళ్ళు లేక చస్తారు అనుకుని పళ్ళు నూరుకున్నాడు లోపల లోపలే.

"ఇదిగో బాబులు! నా బెదిరింపుల సంగతి ఈయనకు బాగా తెలుసు. ఈయన ఒప్పుకున్నట్లే. ఇంత చల్లటి వార్త చెప్పిన మీకు కమ్మని వేడివేడి కాఫీ తెస్తానుండండి'' అని సంబరంగా చంకలు గుద్దుకుంటూ లోపలకు పరుగెత్తింది తాయారు.

"దీని సరదా నాశనం కాను. దీనికోసం నేను బలి పశువునవ్వాలి కాబోలు. ఇంతకు నేనేం చేయాలి. అయినా కాలనీలో ఎవరు దొరకలేదా?'' ఏడుపు మొహం పెట్టాడు అప్పయ్య.

"కాలనీలో ఎవరి దగ్గర డబ్బులు లేవు. మీకు లాటరీ వచ్చింది కదా అని మిమ్మల్ని ఎన్నుకున్నాం. పోతే మీరేం చేయనవసరం లేదు. ఈనెల పదో తారీఖున రవీంద్రభారతిలో జరిగే సన్మాన సభకు మీ సతీమణితో వస్తే చాలు. కాకపోతే ఓ పాతిక వేలకు చెక్ యిస్తే చాలా బాగుంటుంది'' అన్నారువాళ్ళు.

**తాయారు భర్తను హింసించి 5 వేలు పెట్టి పట్టు చీర కొనుక్కుంది.**

ఆనందంగా కళ్ళు మిటకరిస్తూ.

"ఆ పాతికవేలా?" అన్నాడు అప్పయ్య గుండె మ తడుముకుంటూ.

"వాల్లెండి బోడి పాతిక వేలు. లాటరీలో అంత డబ్బు వచ్చింది కాదా! అందులో ఆ డబ్బులు ఇవ్వండి. ఆ సన్మానం గురించి ఆలోచిస్తుంటేనే నాకు ఆనందంతో ఒళ్ళు తిరిగి పోతున్నది" అన్నది తాయారు అందరికీ కాఫీలు అందిస్తూ.

పాతికవేలు తలుచుకుంటుంటే నాకు కళ్ళు తిరిగిపోతున్నాయి అనుకున్నాడు అప్పయ్య. అందరూ కాఫీ తాగుతుంటే తాయారు "మావారు ఎంత మంచి వారో" అంటూ భుజాలు పట్టుకుని గబగబా వూపింది.

తాయారు భర్తను హింసించి, హింసించి అయిదువేలు పెట్టి మంచి పట్టుచీర కొనుక్కున్నది. ముందు కొనవని మొండికేసి భార్య అల్టిమేటంకు భయపడి కొనక తప్పింది కాదు. అప్పయ్య ఉన్న వాటిలో ఓ మంచి డ్రెస్ సెలెక్ట్ చేసి గొప్ప వాళ్ళు చాలా సింపుల్‌గా వుండాలని భర్తకు చెప్పి అద్దెకు తీసుకున్న కారులో వచ్చి రవీంద్ర భారతి ముందు దిగింది తాయారు.

జనం సన్మానసభకు బాగానే వచ్చారు. సన్మాన సంఘం వాళ్ళు మేళతాళాలతో ఎదురొచ్చి గౌరవంగా లోపలకు తీసుకెళ్ళారు. పురోహితులు మంత్రాలు చదువుతూ వుంటే ఒకరు దండ వేసి పెద్ద బొట్టు పెట్టారు. ఇద్దరినీ స్టేజి ప్రక్కన కుర్చీలో కూర్చోబెట్టారు. భర్తను చూసిన తాయారు పక్కున నవ్వింది. ఆమె నవ్వితే బాగుండదు కదాని చుట్టు వున్నవాళ్ళు పకపకమని నవ్వారు.

"కారణం లేకుండా నవ్వడం ఓ ఫాషనా లేక కావాలనే నవ్వావా?" అప్పయ్య భార్య ప్రక్కకు జరిగి మెల్లగా అడిగాడు.

ఆమె మళ్ళీ నవ్వి "మీ మెడలో దండవేసి బొట్టు పెడితే గడ్డంతో వున్న మీరు అచ్చం బలిచ్చే ముందు మేకపోతులా వున్నారు" అన్నది చప్పట్లు కొడుతూ నవ్వలేక కడుపు పట్టుకుని. చుట్టువున్న జనం బెకబెకమనినవ్వారు. అది చూసి ఏం జరిగిందో అర్థంకాని ఆడియన్స్ పకాపకా నవ్వారు.

"మేడం జోక్‌కు హాలంతా దద్దరిల్లిపోయింది' అన్నారొకరు.

అప్పయ్య గుండె గతుక్కు గతుక్కు మంటున్నది. అతను ఎక్కడా, ఎప్పుడు ఎవరి సన్మానం సభ చూడలేదు.

అప్పయ్య మెడలోని దండ తీస్తుంటే తాయారు "ఎందుకు తీస్తున్నారు" అన్నది.

"మళ్ళీ స్టేజీ మీద వేయాలి కదా!" అన్నారు వాళ్ళు.

సభ మొదలైంది. స్టేజీ మీద అప్పయ్య తాయారు కాక మరో ఇద్దరు వ్యక్తులు కూర్చుని వున్నారు. అప్పయ్యకు బితుకు బితుకు మంటోంది లోపల.

"ఇప్పుడు మన అప్పయ్య గారి గురించి రెండు ముక్కలు మాట్లాడవలసిందిగా మన సిటీ సంఘం సేవకురాలు శ్రీమతి రాంబాయిగారిని కోరుతున్నాం" మైక్‌లో వినబడింది.

అప్పయ్య ప్రక్కన కూర్చున్న రాంబాయిగారు వీరలెవల్లో ఓ లుక్ యిచ్చి కళ్ళజోడు స్టైల్‌గా సరిచేసుకుని మైక్ ముందుకెళ్ళి సభకు నమస్కరించి "నేను ఈ సిటీలో సేవా సంఘం స్థాపించి చాలా కాలం అయింది. అది మీ అందరికీ తెలిసే వుంటుంది. ఈనాడు ఈయన్ని గుర్తించి సన్మానిస్తూ నాకీ అవకాశం కల్పించిన ఈ సంఘం వారికి నా అభినందనలు. ఈ రోజు ఈయన్ని నా చేతుల మీదుగా సన్మానించడం నిజంగా నా అదృష్టంగా భావిస్తున్నాను" ప్రక్కనున్న కార్యకర్తను పిలిచి ఈయన పేరేమిటని అడిగి ఈ అప్పయ్యగారి గురించి నాలుగు ముక్కలు చెబుతాను. చిన్నప్పుడు ఈయన నేను కలసి చాలా వరకు చదువుకున్నాం. పెద్దవాళ్ళు ఈయన్ని స్కూలుకు పంపేస్తే ఈయన స్కూలుకు నామం పెట్టి కాలువలో స్నానం చేస్తూ, బట్టలు లేకుండా ఎండలో గోలీ కాయలు ఆడేవారు. ఛీ పాడు అవన్నీ చెప్పాలంటే నాకు సిగ్గుగా వుంది. అయినా చెప్పక తప్పదు మరి. మా టీచర్లు అనే వారు ఒరేయ్ అప్పా నువ్వు బాగా పైకి వస్తావు అని. వారి ఆశీస్సులు ఈనాడు ఫలించాయిలా వుంది."

అప్పయ్యకు అంతా అయోమయంగా వున్నది. ఆమె ఎవరో ఎప్పుడు చూడలేదు. అలాంటిది తన గురించి ఉన్నది లేనివి గుప్పించి చెబుతుంటే బుర్ర గిర్రున తిరిగింది.

"ఎవతండి అది. మీ గురించి మరీ అంత అశ్లీలంగా మాట్లాడుతోంది. దానికి మీకు ఏమిటి సంబంధం? దీని మోజులో పడి నన్నీ మధ్య నిర్లక్ష్యం చేస్తున్నారు. చిన్నప్పటి నుంచి కలిసి చదువుకున్నారు. ప్రేమించుకున్నారు. ఏ కట్నం దగ్గరో తేడాలొచ్చి ఎక్కువ కట్నం ఇస్తున్నారని నన్ను కట్టుకుని వుంటారు ఛీ మీ మగాళ్ళంతా ఇంతే ఇంటికెళ్ళాక మీకు ఎలాంటి శాస్తి చేస్తానో చూడండి. ఇదెవతో నా కొంప కూల్చేలా వుంది" బుడి బుడి రాగాలు అందుకున్నది తాయారు. ఎవరు గమనించకుండా కన్నీళ్ళు తుడుచుకుంటున్నది. అప్పయ్య గొంతులో పచ్చి వెలక్కాయ పడింది.

రాంబాయి గారు ఉపన్యాసం ఆపింది. జనం వీరలెవల్లో చప్పట్లు కొట్టారు. ఆమె ఆపినందుకు కొట్టారో, ఆమెను మెచ్చుకుని కొట్టారో తెలియదు.

మరో పది నిముషాలలో సన్మాన కార్యక్రమం పూర్తయింది. అప్పయ్యను ఎందుకు సన్మానించారో అర్థం కాలేదు. జనానికి అంతకన్నా అర్థంకాక జుట్టు పీక్కుని ఉసూరోమని ఇంటిదారి పట్టారు.

అప్పయ్య పిలుపు మేరకు కాలనీ మెంబర్లంతా వచ్చి ఇంటి ముందు వాలారు.

"బాబూ! మీ సన్మానానికి మీకు ఓ నమస్కారం. నాకెందుకు సన్మానం చేశారో నాకు తెలియక పోయినా పరవాలేదు. కానీ, సభకు వచ్చిన రాంబాయి ఎవరో నా భార్యకు చెప్పక పోతే నా కాపురం కూలిపోయేలా వుంది" బావురు మని ఏడ్చాడు అప్పయ్య.

"ఆమె ఎవరో మాకూ పెద్దగా తెలియదండి. మాట్లాడుతాను, మాట్లాడుతాను అని అయిదువేలిస్తే సర్లెమ్మని అవకాశం యిచ్చాం. నిజంగా ఆమె ఎవరో మాకు తెలియదు" అన్నారు వాళ్ళు.

**బావిలో దూకి చస్తే మిగతావాళ్ళు నీళ్ళు లేక చస్తారు అనుకుని పళ్ళు నూరుకున్నాడు.**